# సలఫ్ మరియు సున్నత్

సలఫ్ అంటే దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) కాలం మొదలుకొని మొదటి మూడు తరాలకు చెందిన ముస్లిములని మనం ఇది వరకే తెలుసు కున్నాం.

సలఫ్ అంతా సున్నత్‌కు అత్యధిక ప్రాధాన్యత నిచ్చేవారు. సున్నత్‌కు వ్యతిరేకంగా ఎవరి ఆలోచనలకూ, అభిప్రాయాలకూ, వారెంత గొప్పవారైనా సరే, వారు ఏ మాత్రం విలువనిచ్చేవారు కాదు.

కొన్ని ఉదాహరణలు చూడండి :

ఉర్వా బిన్ జుబైర్ (రజి అల్లాహు అన్హు) కథనం ప్రకారం అబూ బక్ర్ (రజి అల్లాహు అన్హు) ఇలా తెలిపారు:

"దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ఆచరిస్తూ వుండిన ఏ విషయాన్నీ నేను పరిత్యజించలేను. ఆయన ఆజ్ఞల్లో, ఆచరణల్లో ఏ ఒక్కదానినీ పరిత్యజించినా మార్గ భ్రష్టుణ్ణి అయిపోతానేమో నన్న భయం నాకుంది." *(సహీ బుఖారి)*

అబ్దుల్లా బిన్ మస్ఊద్ (రజి అల్లాహు అన్హు) కథనం : కేవలం (దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) సున్నత్‌ను) పాటించండి. (ధర్మంలో) క్రొత్త విషయాలు సృష్టించకండి. ఎందుకంటే అవి (దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) సున్నత్‌లు) మీకు సరిపోతాయి. *(దారిమి)*

సూఫియాన్ సౌరీ (రహమతుల్లా అలై) వివరించిన ఒక సుదీర్ఘ ఉల్లేఖనంలో, తన దగ్గరికి ఉత్తరం వ్రాసి ప్రశ్నించిన ఒక వ్యక్తికి జవాబుగా ఉమర్ బిన్ అబ్దుల్ అజీజ్ (రహమతుల్లా అలై) ఇలా వ్రాసి పంపారు:

అమ్మాబాద్! నేను నీకు అల్లాహ్‌కు భయపడమని, ఆయన ధర్మంలో మధ్యేమార్గాన్ని అవలంబించమని, ఆయన (సల్లల్లాహు అలైహి వసల్లం)

సున్నత్‌ను అనుసరించమని, దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) సున్నత్‌లన్నీ స్పష్టమయ్యాక కూడా బిద్దతీలు సృష్టించిన బిద్అత్ లను వదిలి దూరంగా వుండమని వసీయతు చేస్తున్నాను. దైవ కృప వల్ల వీటి వల్లనే మార్గ భ్రష్టత నుండి నిన్ను నీవు రక్షించుకో గలుగుతావు.

నీకు ముందు గతించిన వారు (సలఫ్‌లు) వేటితో నైతే సంతృప్తి చెందారో (ఖురాను మరియు హదీసులు) నీవు కూడా వాటితోనే సంతృప్తి చెందు. దీనికి కారణం - వాళ్ళు నీ కన్నా ధర్మాన్ని బాగా ఎరిగినవారు. వారు ఏ విషయాలనైతే వారించారో వాటిని ఖచ్చితమైన జ్ఞానంతోనే వారించారు. సామాజిక విషయాల్లో కూడా వారికి మనకన్నా మంచి అవగాహన వుండేది. ప్రతి మంచి విషయంలోనూ వారిది మనకన్నా పై చేయి వుండేది. *(అబూదావూద్: 4612)*

అబూ అమ్ర్ ఔజాయీ (రహమతుల్లా అలై) కథనం : ప్రజలు మిమ్మల్ని తిరస్కరించినప్పటికీ మీరు మాత్రం మీకు ముందు గతించిన వారి (సలఫ్) ఆదర్శాలకు లోబడి జీవించండి. ఇతరుల అభిప్రాయాలు మీకెంత రంజింప జేసినా వాటిని ఏ మాత్రం అనుసరించకుండా జాగ్రత్తపడండి.

*(ఖతీబ్ బగ్దాదీ : షర్ఫ్ అస్హాబుల్ హదీస్)*